క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: పోరంకి ప్రాంతంలో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు తెలిపారు. ఆయన ఆదివారం వివరాలు తెలుపుతూ విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 8 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామన్నారు. నిడమానూరు రోడ్డు, మహాలక్ష్మినగర్, వసంతనగర్, విష్ణుపురంకాలనీ, లక్ష్మీపురంకాలనీ, సాయినగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా అంతరాయం కలుగుతుందన్నారు. స్థానికులు గమనించి, విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

నేడు యనమలకుదురు ఆలయంలో చీరల వేలం

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీ పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి వారి దేవస్థానంలో సోమవారం అమ్మవారి చీరల బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.గంగాధరరావు తెలిపారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ ఆలయంలో శ్రీపార్వతీదేవి అమ్మవారికి భక్తులు కానుకగా సమర్పించిన చీరలు ఆలయ ప్రాంగణంలో వేలం నిర్వహిస్తామన్నారు. ఈ నెల 20, 27 తేదీలు, వచ్చే నెల 4, 11 తేదీల్లో ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం జరుగుతుందన్నారు. వేలంలో భక్తులు పాల్గొనాలని కోరారు.

ఆదర్శ రైతు చలసాని మృతి



పెనమలూరు: ఆదర్శ రైతు చలసాని సుబ్బారావు(93) ఆదివారం కానూరులో తన స్వగృహంలో మృతి చెందారు. ఆయనకు వృద్ధాప్యం రావటంతో మరణించారని కుటుంబ సభ్యులు తెలిపారు. చలసాని సుబ్బారావుకు ఆదర్శ రైతుగా గుర్తింపు ఉంది. ఆయన వ్యవసాయం చేసిన సమయంలో అధిక దిగుబడులు సాధించి రైతులకు ఆదర్శంగా నిలిచారు. కాగా చలసాని సుబ్బారావు ఏపీ టింబర్ మర్చంట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా, విజయవాడ టింబర్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పని చేశారు. ఆయన మృతికి పలువురు సంతాపం తెలిపారు.

సత్యసాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: సత్యసాయిబాబా 98వ జయంతిని పురస్కరించుకుని ఐదు రోజుల పాటు స్థానిక ఇందిరానగర్‌లోని సత్యసాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా ఆదివారం సత్యసాయిబాబాకు 98 జ్యోతులతో దీపోత్సవం నిర్వహించారు. సాయంత్రం వేద పఠనం, భజన సత్సంగం జరిగింది. సత్యసాయి సేవా సమితి మండల అధ్యక్షుడు బెక్కం వెంకటేశ్వరరావు, సభ్యుడు నండూరు వేణుగోపాలకృష్ణ, గొర్రెల ప్రసాద్, చలసాని రాధారాణి, అమ్మాజీ పాల్గొన్నారు.

హోమియోపతి వైద్యంతో మెరుగైన చికిత్స



హనుమాన్‌జంక్షన్‌రూరల్: దీర్ఘకాలిక, జీవనశైలి వ్యాధులకు హోమియో వైద్యం ద్వారా మెరుగైన చికిత్స పొందవచ్చని ప్రముఖ హోమియో వైద్య నిపుణుడు డాక్టర్ చింతా రవీందర్ చెప్పారు. స్థానిక ఏలూరురోడ్డులోని యనమదల రామస్వామి ధర్మసత్రం ప్రాంగణంలో ఆదివారం ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్థానిక అభయాంజనేయ స్వామి దేవస్థానం పాలక మండలి చైర్మన్ నెరుసు భూషణం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వైద్యశిబిరాన్ని దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన కనక దుర్గాప్రసాద్ లాంఛనంగా ప్రారంభించారు. డాక్టర్ రవీందర్ మాట్లాడుతూ అత్యాధునిక హోమియోపతి కాన్‌స్టిట్యూషనల్ చికిత్స ద్వారా ఏ జబ్బులు దరి చేరకుండా ఆరోగ్యాన్ని పాజిటివ్‌గా పెంపొందించుకోవచ్చని తెలిపారు. ఎలాంటి ఆరోగ్య సమస్యలను అయిన సైడ్ ఎఫెక్ట్ లేకుండా అతి తక్కువ ఖర్చుతో హోమియోపతి వైద్యం ద్వారా చికిత్స పొందవచ్చన్నారు. ఈ వైద్యశిబిరంలో 200 మందికి వైద్య సేవలు అందించి, ఉచితంగా హోమియో మందుల కిట్లను పంపిణీ చేశారు. పుర ప్రముఖులు నండూరు సత్య వెంకటేశ్వర శర్మ, అభయాంజనేయ స్వామి దేవస్థానం కార్యనిర్వాహణాధికారి కూచిపూడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రితికా ఫౌండేషన్ అవార్డుల ప్రదానం

పటమట(విజయవాడతూర్పు): రితికా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నంది అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం నగరంలోని పటమటలో జరిగింది. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన కుందుర్తి నరసింహశర్మకు స్మారక ప్రవీణ అవార్డు, వేలూరి కృష్ణ శర్మ, మీకోసం సేవా సంస్థ అధ్యక్షుడు కొమ్ము శ్రీనివాస్‌కు నంది అవార్డులు అందజేశారు. సమాజానికి వీరు చేసిన సేవలను గుర్తించి ఈ అవార్డులను అందజేసినట్టు కార్యక్రమ నిర్వాహకులు పురాణం భాస్కర బాబు, అనుముల రాంబాబు, కాశీభట్ల మణికంఠ శర్మ తెలిపారు.

పుస్తక పఠనంతో మానసిక వికాసం

- కొనసాగుతున్న గ్రంథాలయ వారోత్సవాలు
- విద్యార్థినులకు రంగవల్లుల పోటీలు



కానుమోలు గ్రంథాలయంలో మాట్లాడుతున్న రచయిత్రి సత్యవతి

హనుమాన్‌జంక్షన్‌రూరల్: పుస్తక పఠనంతో మానసిక వికాసం కలుగుతుందని పలువురు వక్తలు తెలిపారు. మండలంలోని వీరవల్లి, కానుమోలు, బాపులపాడు శాఖా గ్రంథాలయాల్లో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ముందుగా దివంగత ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయాల్లో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను విద్యార్థులు తిలకించారు. కానుమోలు గ్రంథాలయంలో ముఖ్య అతిథిగా హాజరైన రచయిత్రి నూకల సత్యవతి మాట్లాడుతూ విద్యార్థులకు ఇందిరాగాంధీ జీవితచరిత్ర విశేషాలు, పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. వీరవల్లి గ్రంథాలయ కమిటీ అధ్యక్షుడు కోడెబోయిన బాబి, గ్రంథాలయ అధికారులు జె.సుబ్రహ్మణ్యేశ్వరరావు, చిన్నరాజు, స్వర్ణలతాదేవి పాల్గొన్నారు.

ఉంగుటూరులో..

ఉంగుటూరు: మండంలలోని జిల్లా శాఖా గ్రంథాలయాల్లో కొనసాగుతున్న 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో ఆదివారం విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉంగుటూరు జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం అనిత విద్యార్థులకు దిశ, పోక్సోచట్టం, నిర్భయ చట్టాల గురించి అవగాహన కల్పించారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ముగ్గుల పోటీలు నిర్వహించారు. అలాగే తేలప్రోలు, ఆత్కూరు, మానికొండ గ్రంథాలయాల్లో వారోత్సవాలు నిర్వహించారు.

గ్రంథాలయాల ప్రాధాన్యతను గుర్తించాలి

గన్నవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో జరుగుతున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటానికి జెడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్‌రాణి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ.. సమాజంలో గ్రంథాలయాలకు ఉన్న ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని చెప్పారు. ఇక్కడ ఉన్న పుస్తక సంపదను వినియోగించుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కోరారు. గ్రంథాలయ కమిటీ చైర్మన్ నర్రా సీతారామారావు, కమిటీ సభ్యులు చిమట రామారావు, జెడ్పీ బాలుర, బాలికల హైస్కూల్స్ హెచ్‌ఎంలు ఎస్.రవీంద్రభవాని, బి.ఝాన్సీరాణి, ఇన్‌చార్జి గ్రంథాలయాధికారి దొండపాటి బాబురావు, సిబ్బంది పాల్గొన్నారు.



రంగవల్లులు వేస్తున్న విద్యార్థినులు



వణుకూరులో పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

ఆటలతో పోటీతత్వం పెంపు

గన్నవరంరూరల్: ఆటల పోటీలతో విద్యార్థుల్లో పోటీతత్వం పెరుగుతుందని పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ కె.కృపానందం అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక గ్రంథాలయం ఆవరణలో ఆదివారం విద్యార్థులకు మ్యూజికల్ చైర్, తాడు లాగుడు, రన్నింగ్ పోటీలు నిర్వహించారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకుని విద్యార్థులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముస్తాబాద శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. లైబ్రేరి ఆవరణలో రంగవల్లికలు తీర్చిదిద్దారు. రికార్డు అసిస్టెంట్ కె.జ్యోతికుమారి ఆధ్వర్యంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీకి నివాళులర్పించారు.

పెనమలూరులో..

పెనమలూరు: మండల పరిధిలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం భారత మాజీ ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ జయంతి ఘనంగా చేశారు. వణుకూరు గ్రంథాలయం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి భారతి, పలువురు పాల్గొన్నారు. పెనమలూరు శాఖ గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ జయంతి చేశారు. ఆమెకు నివాళులర్పించారు. యోగా మాస్టారు కె.అప్పారావు, గ్రంథాలయ అధికారి పి.హరీషా, యోగా అభ్యాసకురాలు రాధిక, విద్యార్థులు పాల్గొన్నారు.



ముగ్గులను తిలకిస్తున్న జెడ్పీటీసీ ఎలిజబెత్‌రాణి, హెచ్‌ఎంలు



తెన్నేరులో రంగవల్లులు తీర్చిదిద్దుతున్న చిన్నారులు

తెన్నేరులో రంగవల్లుల పోటీలు

కంకిపాడు: తెన్నేరుశాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. వారోత్సవాల్లో భాగంగా ఆదివారం విద్యార్థినులకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. తొలుత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మహిళా సంరక్షణ కార్యదర్శి జ్యోతి, ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం శివకుమార్, గ్రంథాలయాధికారి సునీత పాల్గొన్నారు.

ఉయ్యూరు గ్రంథాలయంలో..

ఉయ్యూరు: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉయ్యూరు గ్రంథాలయంలో విద్యార్థులకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. బాలికలు ఉత్సాహంగా పాల్గొని అందమైన రంగవల్లులను తీర్చిదిద్దారు. తొలి మహిళా ప్రధానమంత్రి ఇందిరాగాంధీ జయంతి పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కూరాడ వెంకటలక్ష్మి, సంఘ సేవకురాలు వీరకుమారి, మహిళా సంరక్షణ కార్యదర్శి ఝాన్సీరాణి, గ్రంథాలయాధికారి రమణి పాల్గొన్నారు.



రంగవల్లులు తీర్చిదిద్దుతున్న విద్యార్థులు

నేడు పునాదిపాడులో 'వై ఏపీ నీడ్స్ జగన్'

కంకిపాడు: మండలంలోని పునాదిపాడు గ్రామంలో సోమవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మద్దాలి రామచంద్రరావు తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. సచివాలయ సందర్శన, పార్టీ పతాకావిష్కరణ, లబ్ధిదారులతో సమీక్ష, ప్రభుత్వ పాలనపై అభిప్రాయ సేకరణ చేస్తామన్నారు. సచివాలయం వద్ద సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

దేశ ప్రగతిలో మహిళల పాత్ర చిరస్మరణీయం



విజయవాడ కల్చరల్: దేశ ప్రగతిలో మహిళల పాత్ర చిరస్మరణీయమైనదని ఏపీఐడీసీ చైర్‌పర్సన్ బండి పుణ్యశీల అన్నారు. పోలుకొండ మంగ తాయారు స్మారక సాహిత్యసేవా సంస్థ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా బందురురోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయంలో మహిళా సాధికారత అంశంగా కార్యక్రమం నిర్వహించారు. పుణ్యశీల మాట్లాడుతూ పురాణకాలం నుంచి కూడా మహిళలు సాంస్కృతిక, రాజకీయ, కళారంగాలలో తమ ప్రతిభను చాటుకుని విజయతీరాలు చేరుకున్నారన్నారు. సరోజినీనాయుడు, ఝాన్సీలక్ష్మీబాయి, రాణి రుద్రమదేవి లాంటి మహిళామణుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. మహిళా సాధికారత కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందని, వాటిని ఉపయోగించుకోవాలని సూచించారు. సభలో ఉమ్మడి కృష్ణాజిల్లా గ్రంథాలయ పరిషత్ చైర్‌పర్సన్ తిప్పరమల్లి జమలపూర్ణమ్మ, రైల్వేశాఖ ప్రతినిధి ఎం.శైలజ ప్రసంగించారు. సంస్థ వ్యవస్థాపకురాలు వి.ఉమామహేశ్వరి కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యాసరచనల పోటీలో విజేతలకు జ్ఞాపికలను అందజేశారు. మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన స్వీయ కవితా పఠనానికి వి.సుధారాణి అధ్యక్షత వహించారు. పలువురు కవయిత్రులు కవితాగానం చేశారు. అభ్యుదయ రచయితల సంఘం ఎన్టీఆర్ జిల్లా బాధ్యుడు కొండపల్లి మాధవరావు దేశభక్తి గీతాలను ఆలపించారు.

సందడిగా జగనన్న ఆరోగ్య సురక్ష విజయోత్సవం



ఎంపీపీ రవిని సత్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ హారిక దంపతులు

గన్నవరం: ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు విజయవంతం కావడంలో అధికారులు, సిబ్బంది కీలకపాత్ర వహించారని జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక పేర్కొన్నారు. స్థానిక పరంధామయ్య సపోట తోటలో ఆదివారం ఎంపీపీ అనగాని రవి ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష విజయోత్సవాన్ని నిర్వహించారు. ఈ వేడుకల్లో పెద్ద సంఖ్యలో అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు కుటుంబ సమేతంగా పాల్గొన్ని ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విజేతలకు జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను విజయవంతం చేసిన ఉద్యోగులు, సిబ్బందికి ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ హారిక మాట్లాడుతూ.. అందరికీ మెరుగైన విద్య, వైద్యం అందించాలనే ఉన్నత ఆశయంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్య సురక్షకు శ్రీకారం చుట్టారని తెలిపారు. ఈ శిబిరాల ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మందికి కార్పొరేట్ స్థాయిలో వైద్య పరీక్షలు చేయడంతో పాటు మందులు పంపిణీ చేశారన్నారు. తీవ్రమైన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి ఆరోగ్యశ్రీ ద్వారా ఆపరేషన్లు చేయించినట్లు తెలిపారు. మహోన్నతమైన కార్యక్రమంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరిని గుర్తించి సత్కరించడం అభినందనీయమన్నారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ గౌసాని, వైస్ ఎంపీపీ కాలగడ్డ శివనాగరాజకుమారి, మాజీ వైస్ ఎంపీపీ గొంది పరంధామయ్య, ఎంపీడీవో ఈ.సత్యకుమార్, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వనసమారాధనలతో అనుబంధాలు బలపడతాయి



ఉసిరి చెట్టుకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు



ఉసిరి చెట్టు వద్ద పూజలు చేస్తున్న మహిళలు

విజయవాడరూరల్: వనసమారాధనలో అనుబంధాలు బలపడతాయని ఏపీ ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. ఆదివారం నున్న గ్రామంలోని చినకంచిలో అమరావతి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్తీక వనసమారాధన కార్యక్రమంలో ఎమ్మెల్యే విష్ణు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్తీక వనసమారాధనలతో ఆత్మీయులైన కుటుంబాల్లోని సభ్యులందరూ ఒకే చోట కలయిక వలన బంధాలు బలపడతాయని పేర్కొన్నారు. మన సంస్కృతీ సాంప్రదాయాలకనుగుణంగా కార్తీక మాసంలో ఉసిరి చెట్టుకు పూజలు చేయడం వలన మంచి జరుగుతుందన్నారు. చినకంచిలోని ఉసిరి చెట్టుకు కార్తీక దామోదర పూజలను అమరావతి బ్రాహ్మణసేవా సంఘానికి చెందిన అనేక మంది దంపతులు సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. శివకేశవులకు ప్రీతికరంగా ప్రత్యేక పూజలు చేసి, వనభోజనాలను చేశారు. శ్రవణా నక్షత్రం కావడంతో చినకంచిలోని ప్రసన్న శ్రీవెంకటేశ్వరస్వామికి భక్తులు ప్రత్యేకంగా అలంకారాలు చేసి అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం పిల్లలు, మహిళలు ఆనందోత్సాహాలతో ఆటలు పాటలకు సంబంధించిన కార్యక్రమాల్లో పాల్గొనడంతో చినకంచిలో పండుగ వాతావరణం నెలకొంది.

ఉత్సాహంగా కార్తీక వనసమారాధన

ఉయ్యూరు: కార్తీక వనసమారాధన కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. శ్రీ శ్రీనివాసా విద్యాసంస్థల ఆవరణలో పాత్రికేయుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వనసమారాధన నిర్వహించారు. మహిళలు ఉసిరి చెట్టు వద్ద పూజా కార్యక్రమాలు జరిపారు. చిన్నారులు ఆటల పోటీలతో సందడి చేశారు. కంకిపాడు సీఐ శ్రీనివాసరావు, ఉయ్యూరు పట్టణ ఎస్ఐ వాసు, శ్రీనివాసా విద్యాసంస్థల చైర్మన్ పరుచూరి శ్రీనివాసరావు, డైరెక్టర్ నీలిమ కార్తీక వనసమారాధన ప్రాముఖ్యతను వివరించి, పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు.

ఆది దంపతుల ఆర్జిత సేవలకు డిమాండ్

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కార్తీక మాసం, ఆదివారం కావడంతో ఇంద్రకీలాద్రిపై ఆది దంపతులకు నిర్వహించిన పలు ఆర్జిత సేవలకు డిమాండ్ అధికంగా ఉంది. తెల్లవారుజామున అమ్మవారి ప్రధాన ఆలయంలో నిర్వహించిన ఖడ్గమాలార్చన, ఉత్సవ మూర్తి వద్ద నిర్వహించిన లక్ష కుంకుమార్చన, శ్రీచక్ర నవార్చన, శాంతి కల్యాణంతో పాటు చండీహోమాల్లో ఉభయదాతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఇక మల్లేశ్వర స్వామి వారికి పంచామృత అభిషేకాలు, త్రికాల అభిషేకాలతో పాటు సహస్ర లింగార్చన, సాయంత్రం ఊంజల్ సేవ, దీపార్చన, పల్లకీ సేవల్లో కూడా భక్తులు భారీగా పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం వద్ద సూర్యభగవానుడి చిత్రపటానికి ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం సూర్య నమస్కారాలు, సూర్యోపాసన సేవ నిర్వహించగా, ఉభయదాతలు పాల్గొన్నారు.

నేడు తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో 'స్పందన'

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండల తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి ప్రజా సమస్యలపై స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కె.లక్ష్మి, ఎంపీడీవో బి.భార్గవి వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను స్పందన కార్యక్రమంలో పాల్గొనే అధికారులకు అర్జీల రూపంలో అందజేయాలన్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ప్రభుత్వ రుణాలు సద్వినియోగం చేసుకోండి

ఐలా చైర్మన్ రామలింగేశ్వరరావు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): పారిశ్రామిక రంగానికి ప్రభుత్వం అందిస్తున్న రుణాలు, సబ్సిడీలు సద్వినియోగం చేసుకోవాలని ఐలా చైర్మన్ ఎంవీ రామలింగేశ్వరరావు అన్నారు. కెవెల్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ ఫెసిలిటేషన్ సెంటర్ ఆధ్వర్యంలో ఎంఎస్‌ఎంఈ ఎంటర్‌ప్రైడ్ స్టార్ట్ అప్ ప్రోగ్రాంపై అవగాహన సదస్సు కొండపల్లి ఐడీఏలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు ఎంఎస్‌ఎంఈ ద్వారా సకాలంలో ఉపయోగించుకుని వ్యాపారంలో అభివృద్ధి సాధించాలన్నారు. కార్యక్రమంలో ఎంఎస్ఎం డీఎఫ్ఓ డీవీ ఎస్ఆర్.మూర్తి, డాక్టర్ రాఘవరావు, ప్రొఫెసర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

పటమట(విజయవాడతూర్పు): గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఆదిత్య డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో పుస్తక సమీక్ష, క్విజ్ పోటీలు నిర్వహించామని కళాశాల ప్రిన్సిపాల్ సయ్యద్ నసీమా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 56వ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించిన ఈ పోటీల్లో విజేతలకు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు బహుమతి ప్రదానం చేశారని తెలిపారు. విజేతలను కళాశాల చైర్మన్ శేషారెడ్డి, సెక్రెటరీ సుగుణ రెడ్డి, డైరెక్టర్ నాయుడు అభినందించారని తెలిపారు.

పేదలకు బాసటగా ఎమ్మెల్యే వంశీమోహన్



రైల్వే అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీమోహన్

ఉంగుటూరు: మండలంలోని తరిగొప్పలలో రైల్వే స్టేషన్ పరిసర ప్రాంత నిర్వాసితులకు ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ బాసటగా నిలిచారు. రైల్వేస్టేషన్ సమీపంలో ఎన్నో ఏళ్లుగా పేదలు నివాసాలు ఏర్పరచుకుని ఉంటున్నారు. ఇటీవల రైల్వే లైన్ల అభివృద్ధిలో భాగంగా రైల్వే అధికారులు ఆ పేదలను తక్షణమే ఆ ప్రాంతాన్ని వదలివెళ్లాలని వారిని ఆదివారం తరలించే ప్రయత్నం చేశారు. దీంతో పేదలు ఏం చేయాలో తెలియక దిక్కుతోచని స్థితిలో ఉండిపోయారు. ఈ విషయాన్ని స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన ఆ ప్రాంతానికి వెళ్లి రైల్వే అధికారులతో మాట్లాడారు. వారికి వేరే ప్రాంతంలో నివాసం ఏర్పాటు చేస్తామని అప్పటి వరకు ఆ ప్రాంత ప్రజలను తరలించవద్దని కోరారు. అదే గ్రామంలో వారికి వేరొక చోట ఇళ్ల స్థలాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తమకు బాసటగా నిలిచిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ కోటగిరి రామ్మోహన్‌రావు, సర్పంచ్ యాండ్రపు అనిత, ఎంపీటీసీ నటరాజన్ తదితరులు పాల్గొన్నారు.




పొంచి ఉన్న ప్రమాదం

ఎండిపోయిన భారీ వృక్షాల రూపంలో ప్రమాదం పొంచి ఉంది. వృక్షాలు కూలిపోయి ఎప్పుడెలాంటి ప్రమాదం సంభవిస్తుందోనన్న భయం ప్రజలను వెంటాడుతోంది. మండలంలోని ఈడుపుగల్లు జెడ్పీ పాఠశాల ఎదురుగా ఈడుపుగల్లు-ఉప్పలూరు ప్రధానరోడ్డు వెంబడి భారీ చింత చెట్టు కొద్ది రోజులు క్రితం ఎండిపోయి కూలిపోయేందుకు సిద్ధంగా ఉంది. కంకిపాడు మార్కెట్‌యార్డు సమీపంలో ప్రధాన రహదారి మార్జిన్‌లో రెండు భారీ వృక్షాలు ఎండిపోయి ఉన్నాయి. నిత్యం వాహనాలు, ప్రజల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ ప్రాంతాల్లో వృక్షాలు కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్నాయి. వృక్షాలు కూలి ప్రమాదం జరగకముందే ఆర్‌అండ్‌బీ, పంచాయతీ అధికారులు స్పందించి వృక్షాలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

– కంకిపాడు

ఘనంగా క్రీస్తురాజు మహోత్సవం



గుణదల(విజయవాడతూర్పు): యేసు పరిశుద్ధ రక్తం ద్వారానే లోకానికి పాప క్షమాపణ లభించిందని విజయవాడ కతోలిక పీఠం బిషప్ తెలగతోటి రాజారావు అన్నారు. క్రీస్తురాజపురంలోని క్రీస్తురాజు దేవాలయ విచారణ మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా దేవాలయ ప్రాంగణంలో సమష్టి దివ్యబలి పూజ సమర్పించారు. భక్తులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ క్రీస్తు మార్గం అనుసరణీయమని, ఆయన ప్రవచనాలను మన జీవితాలలోకి అన్వయించుకోవడం ద్వారా సన్మార్గంలో నడవగలమని తెలిపారు. యేసుక్రీస్తు అనుసరించి చూపిన ప్రేమ, జాలి, కరుణ వంటి లక్షణాలను మనం ఆచరించాలన్నారు. అనంతరం సమష్టి దివ్యబలి పూజ సమర్పించి భక్తులకు దివ్య సత్ప్రసాదాన్ని అందజేశారు. దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేళాంగిణి మాత స్వరూప విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఫాదర్ కొలకాని మరియన్న, ఫాదర్ మొలుగుమాటి ప్రకాష్, గురువులు, భక్తులు పాల్గొన్నారు.